https://teluguislam.net



# అధ్యాయం-6

# 150-169

## 6- అల్లాహ్ ప్రీతిని పొందుటకు అతి గొప్ప సమయాలు

- ఇస్లాం ధర్మంలో సమయాల వాస్తవికత.
- ముహర్రం నెల విశిష్ఠత.
- రజబ్ నెలవిశిష్ఠత.
- షాబాన్ నెల విశిష్ఠత.
- రమజాన్ నెల విశిష్ఠత.
- జుల్ హజ్జ్ (బక్రీద్) నెల విశిష్ఠత.
- రమజాన్ మరియు జుల్‌హజ్జ్ పది రోజుల విశిష్ఠత.
- ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) విశిష్ఠత.
- జుల్ హజ్జ్ పది రోజులు అల్లాహ్‌కు అతి ప్రియమైనవి.
- ముహర్రం పదొవరోజు విశిష్ఠత.
- షాబాన్ 15వ రాత్రి విశిష్ఠత.
- జుల్‌హజ్జ్ తొమ్మిదవ (అరఫా)రోజు అల్లాహ్ తన దాసులను మెచ్చుకుంటాడు.
- అరఫా రోజు ఉపవాసం విశిష్ఠత.
- శుక్రవారం రోజు విశిష్ఠత.
- సోమ, గురువారాల విశిష్ఠత.

https://teluguislam.net



# 6– అల్లాహ్ ప్రీతిని పొందుటకు అతి గొప్ప సమయాలు

## ఇస్లాం ధర్మంలో సమయాల వాస్తవికత:

సమయాలను మనం నెలల క్రమంగా, రోజుల క్రమంగా, అలాగే రాత్రుల క్రమంగా, మరియు సందర్భ సమాయాల క్రమంగా వాటిని తెలుసుకుందాము. ఆయా సమయాలలో అల్లాహ్ ప్రీతిని, ఆయన అనుగ్రహాలను, మరియు ఆ సమయాలలో ఉన్న శుభాలను, వాటి విశిష్ఠతను ఇక్కడ తెలియజేయడం జరుగుతున్నది. కనుక సమయం గురించి హదీసు ఖుద్సీలో ఇలా ఉంది: అల్లాహ్ ఇలా తెలియజేశాడు; ‘‘ఆదము పుత్రుడు(మానవుడు) కాలాన్ని (రోజులను, నెలలను, సంవత్సరాలను, ఘడియలను) తిట్టుతున్నాడు. మరియు నేనే కాలాన్ని. నా చేతిలోనే రాత్రింబవళ్ళ మార్పిడి ఉన్నది.’’ [1]

మరొక చోట ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **‘‘మీరు కాలాన్ని తిట్టకండి. నిశ్చయంగా అల్లాహ్‌యే కాలము.’’** [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘మనిషి ఘోర పాపాలకు దూరంగా ఉంటే, ఐదు పూటల నమాజులు, ఒక జుమా నుండి మరొక

---

[1] (బుఖారీ:4452, ముస్లిం:4170).

[2] (ముస్లిం:4165).

https://teluguislam.net



జుమా, ఒక రమజాన్ మాసం నుండి మరొక రమజాన్ మాసం వరకు మధ్యకాలంలో జరిగిన పాపాలకు పరిహారమవుతాయి.'' [1]

హజ్రత్ అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''ఒక ఉమ్రా తర్వాత మరొక ఉమ్రా చేయటం వాటి మధ్యకాలంలో జరిగిన పాపాలన్నిటికీ పరిహారం అవుతుంది....'' [2]

సమయాన్ని మనం ఎలా ఉపయోగిస్తున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. మనం సమయాన్ని పుణ్యాల కొరకు మరియు అల్లాహ్ ప్రీతి కొరకు ఉపయోగిస్తే దానివలన మనకు ప్రతి సమయంలోనూ మంచిదే జరుగుతుంది. ఒకవేళ చెడుగా ఉపయోగించుకుంటే చెడే ప్రాప్తమవుతుంది. దాని వలన కాలాన్ని దూషించటం కూడా మహా పాపమే అవుతుంది.

**వరుస క్రమంగా అరబీ నెలల పేర్లు:**

1)ముహర్రం, 2)సఫర్, 3)రబీవుల్ అవ్వల్, 4)రబీవుస్ సానీ,
5)జమాదివుల్ అవ్వల్(ఊల), 6)జమాదివుస్ సానీ(ఆఖర్)
7)రజబ్, 8)షాబాన్, 9) రమజాన్, 10) షవ్వాల్,
11) జుల్ ఖాయిదా, 12)జుల్ హజ్జా.

**వరుస క్రమంగా అరబీ రోజుల పేర్లు:**

1)యౌముల్ జుముఆ, 2)యౌముస్ సబ్త్, 3)యౌముల్ అహద్,
4)యౌముల్ ఇస్నైన్, 5)యౌముస్ సులసా, 6)యౌముల్ అర్బిఆ,
7)యౌముల్ ఖమీస్.

---

[1] (ముస్లిం:342).
[2] (బుఖారీ:1650, ముస్లిం:2403).

https://teluguislam.net



## ముహర్రం నెల విశిష్టత:

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు: ''నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే సాగుతున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి) ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి.....'' [1]

ఆ నాలుగు మాసాల గురించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''కాలం తిరిగి తిరిగి యధాస్థితికి – అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి – వచ్చేసింది. ఏడాదిలో పన్నెండు మాసాలుంటాయి. వాటిలో నాలుగు మాసాలు విశిష్టమైనవి (పవిత్రమైనవి) వాటిలో మూడు మాసాలు ఒక దాని తరువాత ఒకటి వస్తాయి. అవే జుల్ ఖాయిదా, జుల్ హజ్, ముహర్రం నాల్గవ మాసం రజబ్. ఇది జమాదివుల్ ఆఖిర్ నెలకీ – షాబాన్ నెలకీ మధ్యన ఉంటుంది.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రమజాన్ తరువాత అల్లాహ్ మాసమయిన ముహర్రం నెలలో పాటించబడే ఉపవాసాలు అత్యంత శ్రేష్ఠమైనవి. అలాగే ఫర్జ్ నమాజుల తరువాత పాటించబడే (నఫిల్) నమాజుల్లో తహజ్జుద్ నమాజు అత్యంత శ్రేష్ఠమైనది.'' [3]

---

[1] (సూరతుతౌబా:36).

[2] (బుఖారీ:2958, ముస్లిం:3179)

[3] (ముస్లిం:1982).

https://teluguislam.net



ముహర్రం మాసపు ఘనతను తెలియజేయటానికి దానిని **'అల్లాహ్ మాసం'** అని అనటం జరిగింది. ఉదాహరణకు **అల్లాహ్‌గృహం, అల్లాహ్ఒంటె** అని ఖుర్‌ఆన్‌లో పేర్కొనడం జరిగింది. అల్లాహ్ అలా పేర్కొనంత మాత్రన అవి అల్లాహ్‌కు అవసరమైన వస్తువులు అని అర్థం కాదు. కాని అల్లాహ్ వాటి విశిష్ఠతను వివరించటమే దాని ఉద్దేశ్యం.

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఆషూరా నాటి ఉపవాసం(ఘనతను) గురించి అడగటం జరిగింది. అందుకాయన సమాధామిస్తూ, **''అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది.''** అని చెప్పారు. [1]

## రజబ్ నెల విశిష్ఠత:

రజబ్ అంటే: అరబీ భాషలో 'గౌరవమ్మైనది, పవిత్రమ్మైనది' కనుక అరబ్ వాసులు ఈ నెలను పవిత్రంగా భావించేవారు మరియు మూఢ (జాహిలియత్) కాలంలో ఈ నెలలో తమ ఆరాధ్యులైన విగ్రహాల పేరున జంతువులను బలినిచ్చేవారు. ఆ జంతువులను వారు 'అతీరా' అని పేర్కోనేవారు. కాని ఇస్లాం ధర్మం వచ్చిన తరువాత ఆ ఆచారాన్ని నిర్మూలించడం జరిగింది.

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) రాక మునుపే, అంటే అనాదిగా రజబ్, జుల్ ఖాయదా, జుల్ హజ్జా మరియు ముహర్రం నెలలను పవిత్రంగా భావించేవారు. ఆ నెలలలో దండయాత్రలు లేక యుద్ధాలు, తగాదాలు వంటి కార్యాలు నిషేధించబడి యున్నవి. దానివల్ల

[1] (ముస్లిం:1976)

https://teluguislam.net



ప్రజలు హజ్ నియమాలను శాంతి భద్రతతో నెరవేర్చుటకు అనుకూల మయ్యేది. తరువాత ఆ నిషేధిత ఆదేశం కూడా తొలిగిపోయింది. అనివార్యమైన స్థితిలో ధర్మ యుద్ధాలు చేయవచ్చునని ధర్మ గురువులు ఏకీభవించారు. కాని ఇతర నెలల కంటే ఎక్కువగా ఈ నాలుగు నెలల పవిత్రతను దృష్టిలో ఉంచుకొని పాపాలకు మరియు అల్లాహ్ ఎడల అవిధేయతకు గురికాకుండా జాగ్రత్త పడాలని హితోపదేశం చేశారు.[1]

ఎందుకంటే? ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే కొనసాగుతున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రద మైనవి) ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి.....’’ [2]

## షాబాన్ నెల విశిష్ఠత:

హజ్రత్ ఇమామ్ హాఫిజ్ ఇబ్నే హజ్ర్ (రహ) రజబ్ నెల గురించి ఇలా తెలియజేశారు: ‘‘రజబ్ నెల పవిత్రమైన నెల కనుక అరేబియా ప్రజలు ఈ నెల గడిచిన పిమ్మట నీటి కొరకై అనేక ప్రాంతాల వైపుకు, కొండల వైపుకు బయలుదేరేవారు. కనుక ఈ నెలను షాబాన్ నెల అంటారు.’’ [3]

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని నేను:

---

1 (లతాయిఫుల్ మఆరిఫ్).
2 (సూరతుతౌబా:36).
3 (ఫత్హుల్‌బారీ:4/251).

https://teluguislam.net



ఓ అల్లాహ్ ప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం)! 'మీరు షాబాన్ మాసంలో (అధికంగా) ఉపవాసాలు పాటించినట్లు, ఏ ఇతర మాసాలలో అన్ని ఉపవాసాలను పాటించినట్లు నేను మిమ్మల్ని చూడలేదు' అని అడిగాను.

దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''రజబ్ మరియు రమజాన్ నెలకి మధ్య ఉన్న షాబాన్ నెల యొక్క వాస్తవం ప్రజలకు తెలియదు. ఈ నెలలో ప్రజలు చేసిన కార్యాలు అల్లాహ్ యందు సమర్పించబడతాయి. కనుక నా పుణ్యకార్యాలు అల్లాహ్ ముందు నేను ఉపవాస స్థితిలో ఉండగా సమర్పించబడాలని ఇష్టపడుతున్నాను'' అని బదులిచ్చారు. [1]

హజ్రత్ అబూ మూసా అల్ అష్అరి (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

''షాబాన్ నెల మధ్య(15వ)రాత్రిన అల్లాహ్ బహిర్గతమవుతాడు, బహుదైవారాధకుడిని మరియు సంబంధాన్ని తెంచుకున్నవాడిని తప్ప ప్రతి ఒక్కరిని క్షమిస్తాడు.''[2]

## రమజాన్ నెల విశిష్టత:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''రమజాన్ నెల – ఖుర్ఆన్ అవతరింప జేయబడిన నెల,అది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. కనుక మీలో ఎవరు ఈ నెలను చూస్తారో వారు ఉపవాసాలుండాలి....'' [3]

---

[1] (సహీహ్ నసాయి:2357).

[2] (సహీహ్ ఇబ్నుమాజా:1390, సిల్‌సిలతుస్ సహీహా:1144, 1/135).

[3] (సూరతుల్ బఖరా: 185).

https://teluguislam.net



హ(జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయినా రమజాన్ మాసంలో విశ్వాసంతో, పుణ్యఫలా పేక్షతో ఉపవాసం పాటిస్తే, గతంలో వారివల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి.'' [1]

హ(జత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''రమజాన్ మాసం రాగానే స్వర్గ ద్వారాలు తెరువబడతాయి. నరక ద్వారాలు మూయబడతాయి. షైతానులను బంధించటం జరుగుతుంది.'' [2]

హ(జత్ ఇబ్నె అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలందరికన్నా ఎక్కువ దానశీలురు. రమజాన్ మాసంలో జిబ్రయీల్ దూత తనను కలుసుకున్నప్పుడయితే ఆయన ఇంకా ఎక్కువగా దానాలు చేసేవారు. నిజం చెప్పాలంటే జిబ్రయీల్ తనను కలిసినప్పుడు ఆయన ప్రభంజనం కన్నా వేగంగా దానధర్మాలు చేసేవారు. [3]

## జుల్ హజ్జ్ (బక్రీద్) నెల విశిష్ఠత:

అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు: 'నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే సాగు తున్నది) వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి.)

---

[1] (బుఖారీ:37, ముస్లిం:1268).

[2] (బుఖారీ:3035, ముస్లిం:1793).

[3] (బుఖారీ:5, ముస్లిం:4268).

https://teluguislam.net



ఇదేసరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి...... [1]

ఆ నాలుగు మాసాల గురించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''కాలం తిరిగి తిరిగి యధాస్థితికి – అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి – వచ్చేసింది. ఏడాదిలో పన్నెండు మాసాలుంటాయి. వాటిలో నాలుగు మాసాలు విశిష్టమైనవి (పవిత్రమైనవి) వాటిలో మూడు మాసాలు ఒక దాని తరువాత ఒకటి వస్తాయి. **అవే జుల్ ఖాయిదా, జుల్ హజ్, ముహర్రం నాల్గవ మాసం రజబ్.** ఇది జమాదివుల్ ఆఖిర్ నెలకీ – షాబాన్ నెలకీ మధ్యన ఉంటుంది.'' [2]

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అరఫా ఉపవాసం(ఘనత) గురించి విచారించగా, దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు:

''ఆ (ఉపవాసం) గత సంవత్సరానికి మరియు రాబోయే సంవత్సరానికి (పాపాలకు) పరిహారమగును.'' [3]

## రమజాన్ మరియు జుల్‌హజ్జ్ పది రోజుల విశిష్ఠత:

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; రమజాన్ మాసం చివరి దశకం రాగానే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''రాత్రిళ్లు జాగారం చేసేవారు. తమ ఇంటివారిని కూడా మేల్కొలిపేవారు. నడుం బిగించి బాగా, ముమ్మరంగా ఆరాధన చేసేవారు.'' [4]

---

[1] (సూరతుతౌబా:36).
[2] (బుఖారీ:2958, ముస్లిం:3179).
[3] (ముస్లిం:1976).
[4] (బుఖారీ:1884, ముస్లిం:2008).

https://teluguislam.net



‘‘రమజాన్ మాసపు చివరి దశకంలో ఏతెకాఫ్ కోసం కూర్చునేవారు. మరియు ఘనమైన రేయిని మీరు రమజాన్ మాసపు చివరి దశకంలో అన్వేశించండి’’ అని ఉపదేశించేవారు.[1]

హ॥జ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘ఘనమైన రేయిని మీరు రమజాన్ మాసపు చివరి దశకంలోని బేసి రాత్రుల్లో అన్వేషించండి.’’[2]

హ॥జ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హ) కథనం: నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని:

‘ఓ అల్లాహ్ ప్రవక్తా! ఒకవేళ ఘనమైన రేయి ఏదో కనుగొంటే ఆ రాత్రి నేను ఏమని ప్రార్థించాలో కాస్త చెబుతారా?’ అని అడిగాను.

అందుకాయన: **‘‘అల్లాహుమ్మ ఇన్నక అఫువున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ’’** (అల్లాహ్ నీవు అమితంగా మన్నించేవాడవు. మన్నింపును ఇష్టపడతావు. కనుక నన్ను మన్నించు). ప్రార్థించమని ఉపదేశించారు.[3]

## ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) విశిష్ఠత:

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖుర్‌ఆనును) ఘనమైన రాత్రి యందు అవతరింపజేసాము. – ఘనమైన రాత్రి గురించి నువ్వేమనుకున్నావు? – ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా మేలైనది. ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ(జిబ్రయీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల (నిర్వహణ)

---

[1] (బుఖారీ:1896, ముస్లిం:1996).
[2] (బుఖారీ:1881).
[3] (సహీహ్ తిర్మిజీ:3513).

https://teluguislam.net



నిమిత్తం (దివి నుంచి భువికి) దిగివస్తారు. – ఆ రాత్రి ఆసాంతం శాంతియుతమైనది– తెల్లవారే వరకూ (అది ఉంటుంది).'' [1]

అంటే? – ఈ రాత్రి యందు చేసే దైవారాధన వెయ్యి మాసాలలో చేసే ఆరాధనకంటే కూడా గొప్పది. వెయ్యి మాసాలంటే మామూలు విషయమా? 83 సంవత్సరాల 4 నెలలన్నమాట! అతి తక్కువ కాలంలో అత్యంత అధికంగా పుణ్యం సంపాదించుకునేందుకు వీలుగా, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజంపై అల్లాహ్ చేసిన మహోపకారం ఇది. [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే విశ్వాసంతో, పుణ్యఫలా పేక్షతో ఘనమైన రేయిలో నమాజు చేస్తూ నిలబడ్డాడో (అల్లాహ్ ఆరాధన చేశారో)గతంలో వారివల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి.'' [3]

## జుల్ హజ్జ్ పది రోజులు అల్లాహ్‌కు అతి ప్రియమైనవి:

అల్లాహ్‌ను విశ్వసించే దాసులు పుణ్యకార్యాల కొరకు జుల్ హజ్జ్ నెల ప్రథమ పది రోజులను ప్రధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే? ఈ రోజులలో కొద్దిపాటి సమయంలో చేసే పుణ్యకార్యాలకు అధిక సంఖ్యలో పుణ్యాలు ప్రాప్తమవుతాయి. కనుక ఈ పది రోజుల ప్రాముఖ్యం గురించి అల్లాహ్ ఇలా తెలియజేశాడు: **''ఉషోదయం సాక్షిగా!–పది రాత్రుల (జుల్‌హజ్జ్ పది రోజుల)సాక్షిగా!''** [4]

---

1 (సూరతుల్ ఖద్ర్).

2 (తఫ్సీర్ అహ్‌సనుల్ బయాన్ తెలుగు: 2733).

3 (బుఖారీ:34, ముస్లిం:1268).

4 (సూరతుల్ ఫజ్ర్:1–2).

https://teluguislam.net



ఇమామ్ ఇబ్ను కసీర్ (రహ) గారు; 'తఫ్సీర్ ఇబ్ను కసీర్' లో ఇలా తెలియజేశారు: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజియల్లాహు అన్హు) గారు పది రాత్రులు అనగా! **'అవి జుల్ హజ్జ్ మొదటి పది రోజులు'** అని తెలియజేశారు.

మరియు హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''జుల్ హజ్జ్ నెలలోని ప్రథమ దశకంలో చేసిన పుణ్యకార్యాలు అల్లాహ్‌కు అన్నిటికన్నా ఎక్కువ ప్రియమైనవి.'' అని అన్నారు.

అది విని సహచరులు అశ్చర్య పడుతూ!: ''ఓ అల్లాహ్ ప్రవక్తా! అల్లాహ్ మార్గంలో చేయబడే పోరాటం కూడా దీనంతగా ప్రియమైనది కాదా?'' అని అడిగారు.

దానికి సమాధానమిస్తూ: ''అల్లాహ్ మార్గంలో చేయబడిన పోరాటం కూడా (ప్రియమైనది) కాదు. ఒక వేళ ఎవరయినా ధన ప్రాణాలు సమేతంగా బయలుదేరి వాటిలో ఏదీ తిరిగిరాకపోతే (అల్లాహ్ మార్గంలో వీరమరణం పొందితే మాత్రం అతనే శ్రేష్ఠుడు)'' అని చెప్పారు. [1]

షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్ను తైమియా (రహ) గారితో కొందరు: 'రమజాన్ చివరి దశకం ఎక్కువ శ్రేష్ఠమైనదా? లేక జుల్ హజ్జ్ ప్రథమ దశకం శ్రేష్ఠమైదా?' అని అడిగారు.

దానికి ఆయన జవాబు ఈ విధంగా ఇచ్చారు: ''రమజాన్ చివరి పది రాత్రులు జుల్ హజ్జ్ ప్రథమ పది రాత్రులకంటే శ్రేష్ఠమైనవి, ఎందుకంటే? దానిలో **లైలతుల్ ఖద్ర్** ఉంది. అది అన్ని రాత్రుల కంటే గొప్పరాత్రి.

[1] (బుఖారీ:916).

https://teluguislam.net



మరియు జుల్‌హజ్జ్ ప్రథమ దశకం పగలు రమజాన్ చివరి దశకం పగలు కన్నా శ్రేష్ఠమైనవి, ఎందుకంటే? దీనిలో **అరఫా రోజు** ఉంది. ఆ రోజు అన్ని రోజుల కంటే ఎంతో శ్రేష్ఠమైన, ఘనమైన రోజు.'' [1]

## ముహర్రం పదోవరోజు విశిష్ఠత:

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని ఆషూరా నాటి ఉపవాసం(ఘనతను) గురించి అడగటం జరిగింది. అందుకాయన సమాధానమిస్తూ, 'అది గత సంవత్సరపు పాపాలన్నిటినీ తుడిచిపెట్టేస్తుంది' అని చెప్పారు. [2]

## షాబాన్ 15వ రాత్రి  విశిష్ఠత:

హజ్రత్ అబూ మూసా అల్ అష్‌అరి (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

''షాబాన్ నెల మధ్య (15వ)రాత్రిన అల్లాహ్ బహిర్గతమవుతాడు, బహుదైవారాధకుడిని మరియు సంబంధాన్ని తెంచుకున్నవాడిని తప్ప ప్రతి ఒక్కరిని క్షమిస్తాడు.'' [3]

షాబాన్ నెల మధ్య (15వ) రాత్రి లేక పగలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రత్యేకమైన ఆరాధనలు చేసినట్లు లేక ఆరాధనలు పాటించమని ఆదేశించినట్లు ఆధారాలు లేవు. సమాజంలో కొంత మంది

---

[1] (మజ్మువుల్ ఫతావా).

[2] (ముస్లిం:1977).

[3] (ఇబ్నుమాజా:1390, సిల్‌సిలతుస్ సహీహా:1562).

https://teluguislam.net



కొన్ని ప్రత్యేకమైన ఆరాధనలను రాత్రి మరియు పగలు పాటించాలని కొన్ని నిరాధారమైన హదీసులను ప్రచురించారు.వాటి ప్రకారం ఆచరించడం ఎంత మాత్రం ధర్మం కాదు.

## జుల్‌హజ్జ్ తొమ్మిదవ (అరఫా)రోజు అల్లాహ్ తన దాసులను మెచ్చుకుంటాడు:

కనుక హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్ను ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం; నిశ్చయంగా అరఫా రోజు సాయంత్రం అరఫా(మైదానం)లో బస చేసిన వారి గురించి అల్లాహ్ తన దూతల ముందు గొప్పలు చెప్పుకుం టున్నాడు. ఆయన ఇలా అంటాడు:

**చూడండి!** ‘‘నా దాసులను వారు నా వద్దకు తమ వెంట్రుకలు చిందరవొందరగా, దుమ్ముధూళియైన స్థితిలో సదూర ప్రాంతాల నుండి వచ్చారు. నా కరుణపై (స్వర్గం మీద) ఆశతో వచ్చారు. నా శిక్ష నుండి భయపడుతూ వాచ్చారు.అయినా వారు నన్ను చూడలేదు. ఒకవేళ వారు నన్ను చూసినట్లయితే వారి వ్యవహారం ఎలా ఉంటుంది?

వారి పాపాలు వారి మీద ఇసుక సంఖ్యకు సమానమైన. లేక ఇహలోకపు రోజులకు సమానమైన లేక వర్షం బిందువుల సంఖ్యకు సమానమైన పాపాలను అల్లాహ్ మీ నుండి కడిగి వేస్తాడు.

ఇంకా మీరు జమ్రాత్(శైతాన్ చిహ్నం)పై గులకరాళ్ళు విసరినందుకు మీ కొరకై పుణ్యాలు సమకూర్చుతాడు, మీరు తలనీలలు అర్పించినందుకు ప్రతి వెంట్రుకకు బదులుగా ఒక పుణ్యం ప్రసాదిస్తాడు. మరియు (కాబతుల్లాహ్) ప్రదక్షణ చేసినందకు సర్వపాపాల నుంచి పునీతులుగా

https://teluguislam.net



చేస్తాడు ఎలాగైతే మీరు మాతృ గర్భం నుంచి పాపాలు లేకుండా పునీతులుగా జన్మించినారో.'' [1]

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రజియల్లాహు అన్హు) తన తండ్రి నుండి ఆయన తన తాత నుండి చేసిన కథనం ప్రకారం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రార్థనల్లో అరఫా రోజు చేసే ప్రార్థన (ఎంతో ఘనమైనది). నేను మరియు నా కంటే ముందు పంపబడిన ప్రవక్తలు పలికిన పదాలు ఎంతో శ్రేష్ఠమైనవి. అవి: **''లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీక లహు లహుల్ ముల్కు, వలహుల్ హమ్దు, వహువ అలా కుల్లి షైఇన్ ఖదీర్.''** [2]

## అరఫా రోజు ఉపవాసం విశిష్ఠత:

హజ్రత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అరఫా ఉపవాసం (ఘనత) గురించి విచారించగా, దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు: ''ఆ (ఉపవాసం) గత సంవత్సరానికి మరియు రాబోయే సంవత్సరానికి (పాపాలకు) పరిహారమగును.'' [3]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''అల్లాహ్ తన దాసులను అరఫా రోజు నరకాగ్ని నుండి విముక్తిని ప్రసాదించినంతగా మరే రోజులోనూ ప్రసాదించడు.'' [4]

---

[1] (తబ్రానీ వ హస్సనహు అల్బానీ ఫీల్ జామిఅస్ సగీర్: 1360).

[2] (సహీహ్ తిర్మిజీ: 3585).

[3] (ముస్లిం:1977).

[4] (ముస్లిం:2402).

https://teluguislam.net



## శుక్రవారం రోజు విశిష్ఠత:

ప్రతి వారంలో శుక్రవారానికి మరియు సోమవారానికి, గురువారానికి ఆరాధనల కారణంగా ప్రాముఖ్యత ఉంది. ఆరాధనలు పాటించని పక్షంలో వారికి ఎలాంటి ప్రాముఖ్యత లేదు. మరియు శుక్రవారం విశ్వాసులు సామూహికంగా ఆరాధనలు ఆచరించాలని ఆజ్ఞాపించబడింది. కనుక అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

''ఓ విశ్వాసులారా! శుక్రవారం నమాజుకు పిలువబడినప్పుడు మీరు అల్లాహ్ నామమును స్మరించడానికి పరుగెత్తండి.'' [1]

ముస్లిం సమాజానికి అల్లాహ్ ప్రసాదించిన అనేక వరాలలో శుక్రవారం కూడా ఒకటి. ఇది ఎంతో శ్రేష్ఠమైనది. ముస్లిములకు అల్లాహ్ ఆ రోజును ప్రత్యేక ప్రార్థనాదినంగా చేశాడు. ఈ ప్రత్యేక దినం యూదులకు, క్రైస్తవులకు లభించలేదు.

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''మా కంటే ముందువున్న యావత్తు అనుచర సమాజాలకు ఎంతో శ్రేష్ఠమైన శుక్రవారం రోజు లభించలేదు. శనివారం యూదులకు లభించింది. ఆదివారం క్రైస్తవులకు లభించింది. తరువాత అల్లాహ్ మనల్ని సృష్టించాడు, శుక్రవారాన్ని ప్రసాదించాడు. ఇలా శుక్రవారం, శనివారం, ఆదివారం వరుసగా చేశాడు. ప్రళయ దినాన వారు మనకంటే వెనుక ఉంటారు. కాని ప్రపంచంలో మనం యావత్తు అనుచర సమాజాలకంటే వెనుక వచ్చాము. అయితే ప్రళయ

---

[1] (సూరతుల్ జుమా:9).

https://teluguislam.net



దినాన యావత్తు అనుచర సమాజాలలో మొట్టమొదట మనకే తీర్పు జరుగుతుంది.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''సూర్యుడు ఉదయించిన రోజుల్లో అన్నిటికంటే శ్రేష్ఠమైనది అది శుక్రవారం రోజు. శుక్రవారం రోజే ఆదం (అలైహిస్సలామ్) గారు సృష్టించబడ్డారు. శుక్రవారం రోజే ఆయన స్వర్గానికి ప్రవేశింపబడ్డారు. శుక్రవారం రోజే స్వర్గం నుండి వెలికి తీయబడ్డారు. మరియు శుక్రవారం రోజే ప్రళయం కూడా రానున్నది.'' [2]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరయితే శుక్రవారం రోజు **'సూరతుల్ కహఫ్'** పఠిస్తారో వారి కొరకై వచ్చే శుక్రవారం వరకు కాంతి ప్రసాదించబడుతుంది. అది వారిని ప్రకాశవంతంగా ఉంచుతుంది. [3]

అల్లామా ఇబ్నుల్ ఖయ్యూమ్ (రహ) ఇలా ఉల్లేఖించారు: 'నెలల్లో రమజాన్ నెలకు ప్రత్యేకత ఉన్నట్లే శుక్రవారానికి ఓ ప్రత్యేకత ఉంది. అలాగే రమజాను నెలలో ఓ ఘనమైన శుభరాత్రి ఉన్నట్లే ఈ దినములో కూడా శుభ ఘడియ ఒకటి ఉంది.'' [4]

---

[1] (ముస్లిం:1415).
[2] (ముస్లిం:1410).
[3] (హాకిమ్:3349, (అత్తర్‌గీబ్ వత్తర్హీబ్:736 సహీహ్ అల్బాని).
[4] (జాదుల్ మఆద్:1/398).

https://teluguislam.net



కనుక హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''నిశ్చయంగా శుక్రవారం రోజున ఒక ఘడియ ఉన్నది ఆ ఘడియలో ఎవరైనా ముస్లిం నమాజు స్థితిలో అల్లాహ్‌ని ఏదైనా వేడుకుంటే అల్లాహ్ అతని కోరికను కచ్చితంగా తీరుస్తాడు. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ సంగతి చెబుతూ: **'ఆ ఘడియ అతి స్వల్పంగా ఉంటుందనీ చేత్తో సైగ చేశారు.'** [1]

అల్లామా ఇబ్నుల్ ఖయ్యూమ్ (రహ) ఆ ఘడియను సహీహ్ హదీసుల వెలుగులో పరిశీలించి రెండు సమయాలను ఇలా స్పష్టం చేశారు.

**(1) ఆ శుభఘడియ:** ఇమాము ప్రసంగానికై వేదికపై కూర్చునప్పటి నుంచి నమాజ్ ముగిసే వరకు మధ్యకాలంలో ఉంటుంది. [2]

**(2)ఆ శుభఘడియ:** అస్ర్ మరియు మగ్రిబ్ నమాజుల మధ్యకాలంలో ఉంటుంది. [3]

హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఒక వ్యక్తి  శుక్రవారం రోజు స్నానం చేసి, వీలైనంత వరకు శుచి శుభ్రతను పాటించి, నూనె రాసుకొని లేక తన ఇంట్లో ఉన్న పరిమళాన్ని పూసుకొని, ఆ తర్వాత (మసీదుకు)వెళ్ళి, (అక్కడ) ఏ ఇద్దరి మధ్యనుంచి కూడా తోసుకొని వెళ్ళకుండా, (మీకంటే ముందుగా కూర్చున్నవారిని

---

[1] (బుఖారీ:883, ముస్లిం:1406).

[2] (ముస్లిం:1409).

[3] (జాదుల్ మఆద్:1/389-390).

https://teluguislam.net



అటూఇటూ జరిపి కూర్చోడానికి ప్రయత్నం చేయకూడదు. ఎక్కడ ఖాళి స్థలం ఉంటే అక్కడే కూర్చోవాలి.) తన అదృష్టంలో వ్రాసిఉన్న నమాజు చేసుకొని, ఆ తర్వాత ఇమాము ప్రసంగిస్తే నిశ్శబ్ధముగా కూర్చుంటే, ఆ శుక్రవారం నుండి మరొక శుక్రవారం వరకు అతనివల్ల జరిగే పాపాలు మన్నించబడతాయి.'' [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఒక్క శుక్రవారం తప్ప ప్రతి రోజు నరకాగ్ని రగిలించబడుతుంది.'' [2]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఏ ముస్లిముకయితే శుక్రవారము రాత్రి లేక పగలు మరణం సంభవిస్తుందో వారిని సమాధి శిక్షకు గురికానివ్వడు.'' [3]

## సోమ, గురువారాల విశిష్ఠత:

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''సోమ మరియు గురువారాల్లో స్వర్గ ద్వారాలు తెరవబడతాయి. ఆ రోజు అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరినీ సాటి కల్పించనివారి ప్రతి ఒక్కరి పాపాలు మన్నించ బడతాయి. కాని తనకూ తన తోటి (ముస్లిం) సోదరునికి మధ్య శత్రుత్వ మున్నవాని పాపాలు మాత్రం మన్నించబడవు.'

---

[1] (బుఖారీ:834).
[2] (జాదుల్ మఆద్:1/387).
[3] (సహీహ్ తిర్మిజీ:1074, అహ్మద్:6294, (సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్హీబ్:3562).

https://teluguislam.net



వారి గురించి: **''వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడవు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడవు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడవు ఇవ్వండి!''** అని అనటం జరుగుతుంది. [1]

హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''సోమ మరియు గురువారాల్లో (అల్లాహ్ సన్నిధిలో దాసుల) ఆచరణలు ప్రవేశపెట్టబడతాయి. అందుకని నేను ఉపవాసిగా ఉన్న స్థితిలో నా ఆచరణ ప్రవేశపెట్టబడడాన్ని నేనిష్టపడతాను.'' [2]

హ్రజత్ అబూ ఖతాదా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని సోమవారం ఉపవాసం గురించి విచారించటం జరిగింది. అందుకాయన సమాధానమిస్తూ, ''అది నా పుట్టిన రోజు మరియు నేను ప్రవక్తగా నియమించబడిన రోజు లేక నాపై వహీ అవతరణ ప్రారంభమైన రోజు'' అని వివరించారు. [3]

---

[1] (ముస్లిం:4652).
[2] (సహీహ్ తిర్మిజీ:747).
[3] (ముస్లిం:1977).